శ్రీ క్రొవ్విడి లింగరాజు

# కథ కావాలి!

'మీ దగ్గరకొక తొందరపనిమీద వచ్చానండి !'

'చెప్పండి.'

'రేపు ఉదయానికొక కథ వ్రాసి ఇవ్వాలండీ.'

'కథా ! ఎందుకు వ్రాయాలి.'

'అలా అంటారేమిటండీ.'

'మరేమనమంటారు ?'

'మీరు కథలు రాస్తుంటారు కదండీ. మా పత్రిక ఎల్లుండి అచ్చుపడి పోవాలండీ. అందులో ఒక కథపడి తీరాలండీ.'

'కథ రాయడానికి నాకు తీరిక ఉండద్దా – రాద్దామనే బుద్ధి పుట్టద్దా !'

'అదేమిటండీ ! కథకు 75 రు.లు పారితోషిక మిస్తామండీ.'

'నాకు గవర్నమెంటు ఉద్యోగంలో డబ్బిస్తున్నారయ్యా. వాళ్ల పని చూడద్దా ! ఇప్పుడు నాకంత డబ్బవసరం లేదండీ.'

''ఇదేం చిత్రమండీ ! ఇలా మాట్లాడినవారు నాకు మీరే కనిపిస్తున్నారు.''

''అయితే మీ ప్రశంసకు నేను సంతోషించవలసిందే.''

''సరే కానిండి, ఒక కథ వ్రాయండీ.''

''ఏం కథ వ్రాయమంటారు ?''

''మీ యిష్టమండీ. మీరు రాయాలంటే ఎంతసేపండీ.''

''కాదండీ, కథ రాయాలంటే రచయితకొక అనుభవమో, అనుభూతో, సందేశమో ఉండనక్కరలేదుటయ్యా ! అంతేకాకుండా ఆ సందేశాన్ని లోకానికందివ్వడానికి కవిత్వంచెప్పాలో, కథరాయాలో, రచయితకు స్ఫురించాలి కదండీ. మీరిల్లా తొందర పెడితే ఎలాగు ?''

''సరిలెండి మీరు చెప్పే పద్ధతిని కథలు రాయాలంటే మా వారపత్రికలు, పక్షపత్రికలు, మాసపత్రికలు ఎల్లా నడుస్తాయండీ.''

''వాటికేమి లోటండీ ! అరగంటలో కథలు వ్రాసేవాళ్లు కొల్లలుగా ఉన్నారు. అందులోనూ స్త్రీ రచయితలు కావలసినంత మంది ఉన్నారు. ప్రేమ గాథలు స్త్రీల కలం నుంచి బయటపడితే చదువుకునేవాళ్లు ఎక్కువ ఆసక్తితో చదువుతారుకదా! మీ పత్రికల ప్రచారం కూడా పెరుగుతుంది !''

''కావచ్చును కానండి, ఈ ప్రేమ కథలు, పేర్లు, స్థలాలు మార్పులు కాని పర్యవసాన మొక విధంగానే మూడు కోణాలమధ్య ప్రదక్షిణం చేస్తున్నాయండి. ఇద్దరు ఆడవాళ్ల ఇరుకున మగవాడో, ఇద్దరు మగవాళ్ల మధ్యన ఒక స్త్రీయో ఇరుకున పడుతున్నారు. పర్యవసానం, హత్యో, ఆత్మహత్యో! దుఃఖాంతమైనా, సుఖాంతమైనా ఇంతే !''

''స్త్రీ పురుషులు లేని ప్రేమగాథ గురించి కథ రాస్తే మీ పాఠకులు చదువుతారంటారా ?''

''చదువుతారనుకోండి. వారు అపిమ్మట ఆనందించావచ్చును, ఆనందించకపోవచ్చును. మాకు దాంతో సంబంధమేమిటండీ.''

ఈ సంభాషణ ఒక ప్రభుత్వయాజమాన్యంలో నడిచే పత్రిక సంపాదకుడికీ, ఒక రచయితకూ మధ్య జరిగినది.

* * *

తాను ప్రేమించిన సామాన్య స్త్రీని పెళ్లి చేసుకోవడానికి ఒకప్పుడు గొప్ప ఉచ్ఛదశలోనున్న బ్రిటిష్ చక్రవర్తి ఎనిమిదవ ఎడ్వర్డు రాజ్యాన్ని త్యాగం చేసిన కథ చదువుతూ ప్రేమనాథ్ అత్యుత్సాహంతో ఆ గాథను ఆకాశానికెత్తుతూంటే వింటున్న 'సర్వజ్ఞశ్రీ' నామకరణం దాల్చిన రచయిత 'ఆగవయ్యా ఆగు' అని అడ్డు తగిలేడు. ఏమండీ అంటూ ఆగిపోయాడు.

ఆ చింకిబట్ట కట్టుకుని తిరుగుతున్న పిచ్చి నాయురును చూశావూ ? అతడి సంగతెప్పుడైనా తెలుసుకున్నావూ ? అతని కథ చెప్తాను విను. ఆ నాయురు ఈ ఊరెప్పుడొచ్చాడో కాని, అతడి మంచి స్థితిలో ఉన్నప్పుడు జిల్లా జడ్జిగారి బంగళాలో వంట చేస్తూండేవాడు. అతడు అమృతప్రాయంగా వంట చేసేవాడని గొప్ప ప్రతీతి. ఆయన కొక కుక్క ఉండేది. ఇంట్లో వంటగదిలో పనిచేసినప్పుడు తప్ప ఆతడు దానితోటే కాలక్షేపం చేసేవాడు. వంట చావిడి వెనకాల వసారాలో ఆ కుక్కకొక గోనెగుడ్డ పరుపు దానిమీద పక్కవేసేవాడు. తానుమాత్రం చాపమీదనే పడుకునేవాడు. ఆ కుక్క హమేషా అతని ప్రక్కనే ఉండేది. అతని జోలికెవరైనా వస్తున్నారని దానికితోస్తే కరచినంత పనిచేసేది. ఈ ప్రపంచంలో ఆయన ప్రేమించినదా కుక్కతప్ప మరే జీవి ఉన్నట్లులేదు. ఆయన జీవితంలో ప్రేమ సంబంధమైన ఆశాభంగమేమైనా ఉన్నదేమో కూడా ఎవరికీతెలియదు తానెప్పుడేమి తింటాడోకాని వేళకి కుక్కకు మాత్రం సుష్టుగా భోజనం పెడతాడు. మాంసాహారులైన ఉద్యోగులు ఆ బంగళాలో ఉన్నంతవరకూ, అతనికి కుక్కమీద ఉండే

ఆప్యాయతకు నవ్వుకునేవారు. కాని ఎన్నడూ ఆయననేమీ అనేవాళ్లు కాదు. వాళ్ల జిహ్వలకు రుచిగా వండి పెడుతుండేవరకూ వాళ్లకేమి కావాలి. ఇలా ఉండగా ఒక జడ్జీగారా బంగళాలో ప్రవేశించారు. ఆయన భార్య ఒక చిత్రమైన వ్యక్తి. ఆవిడకు కుక్కను చూస్తే చిరాకు. కోపం. కుక్క కరిస్తే మనుష్యులు చచ్చిపోతారని ఆమె నమ్మకం. అందుచేత ఆ బంగళాలో ఆమె ప్రవేశించడంతోనే నాయరును కుక్కను వదిలేయమని ఆజ్ఞాపించింది. నాయరు విని పించుకోలేదు. అది తనకు ప్రాణ సమానమని చెప్పేడు కాని అమ్మ గారి తలకా మాటెక్కలేదు. ఇంట్లో అందరికీ నాయరు వంటంటే ప్రీతి కలిగింది, అమ్మగారితో సహా. కాని ఆ కుక్కన్నా, దానిని అంతగా ప్రేమిస్తున్న నాయరన్నా అమ్మగారికి ద్వేషం ప్రబలిపో యింది. ఆ విషయమై కుటుంబంలో చర్చసాగేయి. చివరకు అమ్మ గారి ఆజ్ఞ జడ్జీగారి ఆజ్ఞకు కూడా పై ఆజ్ఞ అయింది. నాయరు కుక్కతో బంగళాను వదలిపెట్టవలసి వచ్చింది. కారణం తెలియదు కాని నాయరు మరెక్కడా ఉద్యోగానికి కుదురలేదు. ఆతని పాకశాస్త్ర ప్రతిభ నెరిగినవారు వంట చేయించుకుని ఏమైనాఇస్తే ఆ కుక్కకు ఇంతపెట్టి తాను తినేవాడు. కుక్క కోసం ఒక గోనె పట్టా చంకను పెట్టుకుని రాత్రివేళ ఏఅరుగుమీదనో దానిని పరుండబెట్టి తాను పడుకునేవాడు. నాయరు కథ కొంత వెలుగులో పడింది కనుక ఎవ్వరూ ఆతని జోలికీ, కుక్క జోలికీ వెళ్లేవారు కాదు. ఆ రెండు జీవుల అన్యోన్య ప్రేమ అలా సాగిపోతోంది.

* * *

ఒకనాడు మ్యునిసిపాలిటీవారు పొరుగూరి నుంచి కుక్కలను పట్టించడానికి మనుష్యులను రప్పించారు. వాళ్ల దృష్టి నాయరు కుక్కమీద పడింది. దాని మెళ్లో తోలుపట్టీలేదాయె. దాని ముఖాన మందు చల్లి అది మూర్ఛలోపడ్డాక కుక్కల బండిలో కెక్కించారు. నాయరు 'అది నా ప్రాణమ'ని మొర్రోమన్నాడు. నాలుగు రూపా యలు సంపాదనను, కుక్కలు పట్టేవాళ్లు వదలుకుంటారా? కుక్క గతి ఏమైందో చెప్పనక్కరలేదు. నాయరుకు మాత్రం మతిపో యింది. అలా వీధుల్లో తిరుగుతుంటాడు. ఎవరైనా ఏమైనా పెడితే దారిలో కనబడ్డ కుక్కలకు పారేసి ఏమైనా తింటాడేమో.

అది నాయరు కథ — ప్రేమనాథ్ వంటి నాయరుకు కుక్క మీద ఉన్న ప్రేమ ఏస్థాయిదంటావు? ఎడ్వర్డు చక్రవర్తికి రాజ్యం పోయింది కాని దరిద్రం రాలేదు. మతి పోలేదు. నాయరుకంటావా ఒక జీవిమీది ప్రేమ అతని సర్వస్వాన్నీ నాశనం చేసింది.

ప్రేమనాథ్‌కు సర్వజ్ఞశ్రీ ఈ కథ చెప్పి ఒక ప్రేమగాథతో హృదయాన్ని కరిగించే సందేశాన్ని అందచేశాడు.

* * *

కథ రాయాలంటే కథకుడికొక సందేశం ఉండాలి కదా!

# ఉమర్‌ఖయ్యాం బాత్రూమ్ సాంగ్

## మ హేం ద్ర

అంతూ పొంతూ తెలియని కాల సముద్రంలో నుంచీ
భగవానుడు ప్రసాదించిన ఒక బకెట్ నీరు ఈ జీవితకాలం
నిన్ను నీవే రుద్దుకోమని ఇచ్చిన వాసనల సబ్బు శరీరం
క్షణక్షణమూ నీరు కారిపోతుంది
అనుక్షణమూ సోపు అరిగిపోతుంది
శరీరంపై అరిగిన సబ్బు స్మృతుల వాసనలు వెదజల్లుతుంది
మిగిలిన సబ్బు రేపటి దినమనే ఊహకు వూపిరి పోస్తుంది
ఒక బకెట్ నీరేం చాలుతుందనుకోకు
అంతా శరీరంపై జారుతోందా —
లేదా వృధాగా జలదారిలోకి పారిపోతోందా చూసుకో
స్నానం పూర్తికాగానే
చావనే తువ్వాలుతో ఆత్మను శుభ్రంగా తుడుచుకుని
ఇంట్లోకెళ్ళిపో
అంతములేని ఈ భువనమంతయు ఒక పురాతన స్నానశాల.